# దాని పేరు ప్రేమ!

కూతురు చావుబతుకుల్లో ఉందని ఆసుపత్రి నుంచి తన ఆఫీసుకి ఫోన్ వచ్చేసరికి మతిపోయిన దానిలా కుర్చీలో కూలబడిపోయింది సుగుణ. ఆమె సహోద్యోగి రామారావు ధైర్యం చెప్పి, ఆటోలో కూర్చోబెట్టి, ఏ ఆసుపత్రో అడిగి, అక్కడికి తీసుకువెళ్ళాడు. అది ప్రైవేటు ఆసుపత్రి. ఇందిరా పార్కు దగ్గరుంది.

పొద్దున్నే కాలేజికి వెళ్ళేటప్పుడు కొత్తగా కొనుక్కున్న పింక్ డ్రెస్ వేసుకుని వెళ్ళింది మహిత. "ఇవ్వాళ 'వేలంటిన్స్ డే' అని ఉత్సాహంగా అంటూ వెళ్ళింది. ఆ ముందురోజే మహిత కజిన్ రాజు దగ్గర నుంచి ఢిల్లీ నుంచి ఒక కవరు వచ్చింది. అందులో ఉన్న గ్రీటింగ్ కార్డు ముడుతలుపడిపోయి, చేత్తో కచ్చుగా నలిపేసినట్లుంది. అది చూసి,

"ఇదేమిటే, ఇలాంటిది పంపించాడు? చూసుకోలేదా?" అంది సుగుణ.

మహిత నవ్వుతూ, 'లేదమ్మా, దాని స్టైలే అంత! 'ఇటీజ్ మై లవింగ్ హగ్' అని రాసి ఉంది చూడు" అని కార్డులో ఉన్న అక్షరాల్ని చూపించింది తల్లికి.

'ఏడిశాడు, వెధవ్వేషాలూ వాడూనూ! ఏమిటది, ధృతరాష్ట్రుడి కౌగిలిలాగ!" అంది సుగుణ నిరసనగా.

అసలీ 'వేలెంటిన్స్ డే' వేలంవెర్రి చూస్తూంటే ఒళ్ళు మండిపోతోంది సుగుణకి. "ఈ పిచ్చి నువ్వూ అంటించుకోకు" అని చెప్పింది.

కానీ మహిత తేలిగ్గా తీసుకుంది. "ఇది ఇవాళ ఒక్కరోజు సరదాయేనమ్మా. మరీ సీరియస్‌గా తీసుకోకు" అని నచ్చజెప్పింది.

ఈ మధ్య మహిత క్లాస్‌మేట్ రమేష్ ఆదివారంపూట కారులో తమ ఇంటికి వస్తున్నాడు. బాగా డబ్బున్నవాడిలా అన్నాడు. వచ్చాడంటే వదలడు. "ఎందుకే వాడు ప్రతి ఆదివారం ఇక్కడికొస్తున్నాడు? వారం పొడుగునా కలుసుకున్నది చాలకనా?" అంది సుగుణ ఒక

రోజున. "మేథ్స్‌లో కొంచెం వీక్ అతను. నా సలహాల కోసం వస్తున్నాడు, అంతే" అంది మహిత.

"వాడి మీద నీకు జాలేమిటి? ట్యూటర్‌ని పెట్టుకోలేడూ?" అంది తల్లి.

"ట్యూటర్‌ని పెట్టుకోలేక కాదు, "నువ్వు చెప్పినంత స్పష్టంగా అర్థమయ్యేటట్లు ఎంత డబ్బు పోసినా ఎవడూ చెప్పడు. నువ్వు నాకు హెల్ప్ చెయ్యకపోతే నేను ఫెయిలైపోతాను. నా మీద దయ ఉంచు" అని బతిమాల్తాడమ్మా. అందుకే సరే అన్నాను" అంది మహిత.

కూతురి జవాబుతో సమాధానపడలేదు సుగుణ. "పోనీ, ఎవరైనా ఇంకో తెలివైన కుర్రాడి దగ్గరికి వెళ్ళొచ్చు కదా, నీ దగ్గరకే ఎందుకు?" అంది సుగుణ.

"ఏమిటమ్మా నువ్వు కూడా! ఈ ఆడ, మగ అంటూ తేడాగా చూడటం!" అని తేలిగ్గా కొట్టి పారేసింది మహిత.

"సరేలే, ఎన్నిసార్లు చెప్పినా నీకు బుర్రకెక్కడం లేదు. వాడి మాటలు నమ్మి వాడిమీద జాలిపడేవు జాగ్రత్త! నీ జాగ్రత్తలో నువ్వుండమ్మా. ఇంతకన్న నేనేం చెప్పను?" అని ఊరుకుంది.

ఆ రోజున ఉదయం కూడా కాలేజికి వెళ్ళే ముందు మరీ మరీ చెప్పింది - సాయంకాలం ఎవరితోనూ కలిసి పార్టీలంటూ వెళ్ళొద్దని. తను ఆఫీసుకి వెళ్ళి పనిలో నిమగ్నమైపోయింది. సరిగ్గా ఇంటికి వెడదామని ఫైల్స్ అన్నీ సర్దుకుంటూండగా మహిత కాలేజి నుంచి ఫోనొచ్చింది - పిడుగులాంటి వార్త చెబుతూ. తను అనుకున్నట్లుగానే కొందరు అబ్బాయిలూ అమ్మాయిలూ సరదా పడ్డారుట పార్టీ చేసుకుందామని. ఎక్కడికో బయలుదేరడానికి సిద్ధమయ్యారుట. కానీ గేటు బయట ఉన్న కారులోకి మహిత రానందిట. ఎవరెంత చెప్పినా మహిత ఒప్పుకోలేదుట. వెంటనే రమేష్ కారు దిగి, జేబులోంచి చాకుతీసి మడత విప్పి మహిత పొట్టలో కసుక్కున గుచ్చి, కసకసా కనిపించిన చోటల్లా ఒళ్ళంతా పొడిచాడుట - అందరూ చుట్టూ ఉండి చూస్తుండగా.. తక్కినవాళ్ళ కేకలూ, పెడబొబ్బలూ విని యాజమాన్యం తాలూకు వాళ్ళు పరిగెత్తుకొచ్చారుట. నిలువెల్లా రక్తం ఓడుతున్న మహితని తీసికెళ్ళి ఆసుపత్రిలో డబ్బుకట్టి చేర్పించారుట. పోలీస్ రిపోర్టు ఇచ్చారుట.

ఇదంతా విన్న సుగుణ ఒళ్ళంతా చచ్చుబడి పోయి, మతిపోయినట్లయి, కుర్చీలోంచి లేవలేక పోయింది. ఆమె కొలీగ్ ఆమెకి ధైర్యం చెప్పి, లేవదీసి, ఏ ఆసుపత్రో పేరు కనుక్కొని, అక్కడికి ఆటోలో తీసుకువెళ్ళాడు.

ఆసుపత్రికి వెళ్ళి కనుక్కుంటే మహిత ఆపరేషన్ థియేటర్‌లో ఉందని చెప్పారు. పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. రక్తం ఎక్కిస్తున్నారు. చేయవలసిన వైద్యం అంతా చేస్తున్నారు. మహితని పొడిచిన వాణ్ణి పట్టుకుని పోలీసులకి అప్పగించారుట.

సుగుణ నిస్సహాయంగా వరండాలో ఒక సీటు మీద కూర్చుని, మహిత మన లోకంలోకి ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తూ కూర్చుంది. రమేష్ కారులో వెళ్ళబోయిన ఒకమ్మాయి సుగుణ దగ్గరకొచ్చి కూర్చుని, ఆవిడ చేతిని తన చేతిలోకి తీసుకుని, "వెరీవెరీసారీ ఆంటీ, మేమంతా దగ్గరుండి కూడా ఏమీ చేయలేకపోయాం. ఇంత ఘాతుకానికి పూనుకుంటాడని ఊహించలేదు. క్యాంటీన్‌లో మేమంతా ఎప్పుడు కలుసుకున్నా సరదాగా కబుర్లు చెప్పుకునే వాళ్ళం. రమేష్‌కి మహిత అంటే పిచ్చిప్రేమ! తనని చూడకుండా ఒక్కరోజు ఉండలేనంటాడు. అలాంటి వాడు..." అని, ఇంకా ఏదో చెప్పబోతుంటే, సుగుణ వాడిగా చూసింది ఆ అమ్మాయి వైపు. సుగుణ మౌనంగా ఉండటం చూసి, "మళ్ళీ వస్తాను ఆంటీ" అని చెప్పి వెళ్ళిపోయింది.

అటువైపు నుంచి వచ్చిన నర్సుని మహిత గురించి అడిగితే, 'ఇంకా ఆపరేషన్ జరుగుతోంది' అని చెప్పింది.

సుగుణకి మనస్సు పరిపరివిధాల పోతోంది. తన గతానుభవాలు గుర్తుకొస్తున్నాయి. వాటి ఆధారంగానే, మహితకి చిలక్కి చెప్పినట్లు చెబుతూ వచ్చింది– "మగవాడి మాటలకి మోసపోవద్దు. వాడిపైన జాలి పడేవు జాగ్రత్త!" అని.

ఒకసారి సుగుణ తన ఆఫీసు ప్రతినిధిగా, సమాచార సేకరణ, వినియోగాల్లో ఉన్నత సాంకేతిక శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి బెంగుళూరు వెళ్ళింది. అలాగే నాగేంద్ర మరో సంస్థ నుంచి వచ్చాడు హైదరాబాదు నుంచే. మొత్తం వివిధ ప్రాంతాల నుంచి ముప్పై మంది ప్రతినిధులు వచ్చారు. ఒక గెస్ట్ హౌస్‌లో గదులు ఏర్పాటు చేశారు. కొన్ని గదుల్లో ఇద్దరేసి పురుషులు ఉన్నారు. తనతోపాటు ఉండేందుకు బయట నుంచి వచ్చిన స్త్రీలు ఎవరూ లేరు. ఇద్దరు స్త్రీలు బెంగుళూరు వాస్తవ్యులే కనుక, వాళ్ళు ఇళ్ళ నుంచే వచ్చేవారు. తనకి విడిగా ఒక గది ఏర్పాటైంది. అయిదురోజుల శిక్షణా కార్యక్రమం, రోజంతా శిక్షణ తరగతులూ, చర్చలూ అయ్యాక, అందరూ తలో రకంగా కాలం గడిపి, మళ్ళీ భోజనాలకు డైనింగ్ హాల్‌కి చేరుకుని, భోజనాలయ్యాక తమతమ గదుల్లోకి వెళ్ళిపోయేవారు. నాలుగోరోజున సైటసీయింగుకి వెళ్ళారు అంతా కలిసి మైసూరుకి. అక్కడ ఒకచోట మెట్ల మీద కాలుజారి పాదం మడతపడింది నాగేంద్రకి. అక్కడే 'అమ్మా'

అంటూ చతికిలబడి పోయాడు. అటుపక్కన కొంచెం దూరంలో నడుస్తున్న సుగుణ అతన్ని గమనించి, దగ్గరికి వెళ్ళి పరామర్శించింది ఏమైందని. చెప్పాడు. వెంటనే హేండ్ బ్యాగ్‌లోంచి "మూవ్" ట్యూబ్ తీసి ఇచ్చింది రాసుకోమని. అతను దాని మూత తీసి అలాగే పట్టుకుని, పాదం మీద చెయ్యివెయ్యలేనంత బాధగా మూలిగాడు. అప్పుడు సుగుణ కిందిమెట్టు మీద కూర్చుని స్వయంగా అతని సీలమండ వాపు మీద రాసింది ఆయింట్‌మెంట్‌ని. కాస్సేపు ఆపసోపాలు పడి, థ్యాంక్స్ చెప్పి, ఎలాగో లేచి కుంటుకుంటూ నడిచి టూరిస్టు బస్సులోకి ఎక్కి కూర్చున్నాడు.

ఆ రాత్రి డైనింగ్ హాల్లో భోంచేసి, తన గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుని, డ్రెస్ మార్చుకుని పడుకోబోతోంది సుగుణ. ఎవరో తలుపు తట్టారు. నైటీలో ఉంది తను. తలుపు ఓరగా తెరిచి చూసింది. వచ్చినవాడు నాగేంద్ర. "ఒకసారి ఆ 'మూవ్' మళ్ళీ ఇస్తారా? సారీ, మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను" అన్నాడు.

"ఫరవాలేదు", అంటూ తన బ్యాగ్‌లోంచి "మూవ్" ట్యూబ్‌ని తీసుకురావడానికి అలమార్ధు దగ్గరికి వెళ్ళింది. ఈలోగా అతను లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

'మూవ్'ని స్వయంగా రాసుకోలేకపోతున్నట్లు గిలగిల్లాడాడు పాదం ముట్టుకుంటూనే. సుగుణ అలాగే నించుంది.

"ప్లీజ్, ఒక్కసారి హెల్ప్ చేస్తారా?" అని అడిగాడు దీనంగా. పాదం వాపు ఇంకా తెలుస్తోంది. అందుకని పాదానికి ఆయింట్‌మెంట్ రాసింది. అతను కుర్చీమీద తల వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు -తన్మయత్వంతో ఉన్నట్లు.

"కొంచెం తగ్గిందా?" అని అడిగింది సుగుణ.

"మీ దివ్యమైన హస్తం తగిలితే తగ్గకుండా ఉంటుందా?" అన్నాడు చిరునవ్వుతో.

"రేపెలాగూ ఇంటికి ప్రయాణమేగా, వెళ్ళాక బాగా కాపడం పెట్టి మసాజ్ చేయించుకోండి" అంది సుగుణ.

"నాకా అదృష్టం లేదులెండి" అన్నాడు నాగేంద్ర.

"అదేం?" అంది సుగుణ తెల్లబోతూ.

"మా ఆవిడతో నాకంత అదృష్టం కూడానా! తను స్వయంగా ఒక రోగిష్టిది, నాకేం సేవ చేస్తుంది?" అంటూ కుర్చీలోంచి లేవబోయి ముందుకి తూలాడు. సుగుణ అతన్ని పట్టుకుంది పడిపోకుండా. అంతే అతను ఆమెని గట్టిగా తన బాహువుల్లో బిగించి పట్టుకున్నాడు. ఆమె మెడమీదా బుగ్గలమీదా అతని వెచ్చని ఊపిరి తగుల్తోంది. విడిపించుకుందామంటే వదలకుండా. "మీ స్పర్శ ఎంత బావుంది! ఎంత హాయిగా

ఉంది!" అంటూ గుసగుసలాడాడు. ఆమె విడిపించుకుంటున్న కొద్దీ పట్టు మెత్తగానే బిగించి కాలు ఈడుస్తూనే మంచం వైపుకి తీసుకుపోయాడు.

మూడేళ్ళ క్రితం మరణించిన భర్త మనస్సులో మెదిలి భయంతో బిగుసుకుపోయింది. ఎదురుగా ఉన్న అతన్ని చెంప మీద కొట్టడానికైనా, వెనక్కి తోసెయ్యడానికైనా వీల్లేనంత మెత్తని బిగింపు. చెంపమీద అతని ఊపిరి ఆమె పెదవులకి సోకింది. మొదటి నుంచీ భర్త యాంత్రిక ప్రవర్తనకి అలవాటుపడిన ఆమెకి ఈ అనుభవం విపరీతంగా అనిపించింది. తన ప్రమేయం లేకుండానే లొంగి పోయింది.

తన పని అయిపోగానే, 'సారీ', 'థ్యాంక్స్' రెండూ చెప్పి తన గదికి వెళ్ళిపోయాడు. ఆ రాత్రంతా సుగుణకి నిద్రపట్టలేదు. "తను ఎందుకింత దిగజారిపోయింది!" అని పదే పదే అనుకుంటూ ఆమె మనస్సు మూలిగింది. ఇంటికెళ్ళాక తన కూతురికి తన మొహం ఎలా చూపించాలో అర్థం కాలేదు. మర్నాడు ఎవరి మొహం చూసినా కుంచించుకు పోయింది. అందరికీ తన విషయం తెలిసిపోయిందన్నట్లు. అతని ముఖం చూడకుండా తప్పించుకోవడం సాధ్యం కాలేదు. చూపుకలిస్తే చిరునవ్వు నవ్వుతున్నాడు. సుగుణ మొహం బిగుసుకుపోయింది. అతని ముఖంలో ఎక్కడా కాలు నొప్పి తాలూకు బాధ కనిపించలేదు. ఆ బాధంతా సుగుణ ముఖం మీదికి బదిలీ అయిపోయినట్లనిపించిందామెకి.

హైదరాబాదుకి తిరిగి వెళ్ళాక ఏమీ జరగనట్లు ఉండటానికి ప్రయత్నించింది. కానీ నాగేంద్ర వాళ్ళ ఆఫీసు నుంచి ఫోన్ చేసి సుగుణని పలకరించాడు. ముభావంగా మాట్లాడి పెట్టేసింది. అయినా వదల్లేదు. రోజూ ఫోన్ చేస్తూ తన ఆఫీసు పనికి కూడా ఆటంకం కలిగిస్తుంటే అసహ్యం వేసి, "ఏమిటిది? ఏదో ఒక తప్పు జరిగిపోతే, దాన్ని కొనసాగించాలా? నా మానాన నన్ను వదలండి దయచేసి" అంది నిష్ఠూరంగా.

"ఇంత జరిగాకా?" అన్నాడు నాగేంద్ర.

తెల్లబోయినా, నిభాయించుకుని, "ఏం జరిగింది? నాకేం గుర్తు లేదు" అని ఫోన్ పెట్టేసింది. అయినా అతను వదల్లేదు. "ఒక్కసారి నిన్ను కలుసుకోవాలి. ప్లీజ్" అనీ, "నిన్ను ప్రేమిస్తున్నాను సుగుణా" అనీ, "నన్ను కాదనకు, నేను బతకలేను నువ్వు లేకపోతే" అనీ మొదలుపెట్టాడు. "ఎప్పుడో నా ఆత్మహత్య కబురు నీకు అందుతుంది" అన్నాడు ఆర్ద్రకంఠంతో. సుగుణ నిర్లక్ష్యం చేస్తున్న కొద్దీ ఆత్మహత్య బెదిరింపు ఎక్కువైంది. ఎక్కడ తన ఆఫీసుకి వస్తాడో అని బెదిరిపోయింది.

ఓ రోజున కూతురితో సినిమాకి వెళ్ళినప్పుడు అతను సినిమాహాల్లోంచి బయటికి వెడుతూ దూరం నుంచి కనిపించాడు. అతని పక్కన ఒక స్త్రీ ఉంది. భార్యలాగే ఉంది. పక్కన ఒదిగి నడుస్తోంది. గేటు దాటిస్తూ ఆమె నడుం పక్కన చెయ్యి వేసి ఉంచాడు

పదిలంగా. సుగుణ గుండె మండిపోయింది. అతన్ని వెంబడించి చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది.

అతను మళ్ళీ ఫోన్ చేశాడు యథాప్రకారం దీనంగా.

"ఈసారి ఫోన్ చేశావంటే పోలీస్ కంప్లెయింట్ ఇస్తాను జాగ్రత్త!" అని ధైర్యంగా బెదిరించింది. తరవాత అతను మరో చోటికి బదిలీ అయ్యాడని తెలిసి, "పీడ విరగడైంది" అనుకుంది.

నర్స్ వచ్చి, "అమ్మా, మీ పాపకి స్పృహ వచ్చింది. రండి, చూద్దురు గాని" అంది. ఒక్క ఉదుటున గతంలోంచి బయటపడి, లేచి ఆమెని అనుసరించింది.

రక్తపు మరకలతో ఉన్న బట్టలతో, పొట్టమీదా, ముఖం చుట్టూ చేతుల మీదా బ్యాండేజీలతో ఉన్న మహితని చూడగానే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. మహిత మగతగా చూస్తోంది. ముఖం చుట్టూ ఉన్న కట్టుమీద నుంచే బుగ్గల మీద తాకుతూ, ఏడుస్తూ, "నీకే ఎందుకిలా జరిగిందమ్మా? నిన్నిలా క్రూరంగా హింసించిన ఆ రాక్షసుడెక్కడున్నాడే?" అంటూ రోదించింది.

అంతలోకే ఎవరో ఇద్దరు - దంపతులొచ్చారు మహిత బెడ్ దగ్గరికి. వాళ్ళిద్దరూ దుఃఖంతో కుంగిపోతున్నట్లున్నారు. "మీ అమ్మాయికి ఈ ఘోరం జరగడానికి మేమేం పాపం చేశామో తెలియడం లేదు. అటువంటి రాక్షసుడు మా కడుపున పుట్టినందుకు సిగ్గుపడుతున్నాం. బాధపడుతున్నాం" అన్నారు సుగుణని ఉద్దేశించి.

"మీరేనా ఆ రాక్షసుణ్ణి కన్న తల్లిదండ్రులు? వాణ్ణి చంపినా పాపం లేదు" అని గర్జించింది సుగుణ.

"అవునమ్మా, మీరేం అన్నా తప్పు లేదు. నాకే నా చేతుల్తో వాడి గొంతు పిసికి చంపెయ్యాలని ఉంది" అంది రమేష్ తల్లి. ఆవిడ మాటల్ని నమ్మబుద్ధి కాలేదు సుగుణకి దుఃఖ తీవ్రతలో.

"వెధవ నాటకం!" అంది పళ్ళు బిగించి.

"అమ్మా" అని మెల్లిగా మూలిగింది మహిత.

"నా తల్లీ. ఎలా ఉందమ్మా? నువ్వు బాధపడకు, వాణ్ణి నిలువునా చీరేస్తాను, చంపి పాతరేస్తాను. ఊరుకోను" అని అరుస్తూ ఏడ్చింది సుగుణ.

"చంపి ఏం లాభం? అసలు ప్రేమంటే ఏమిటో, మనుషుల్ని ప్రేమించడం ఎలాగో నేర్పించాలి గాని..." అంటూ ఆయాసపడుతూ, ఎటో పైకి చూస్తూ అలా నిశ్చలంగా ఉండిపోయింది మహిత.

సుగుణ గొల్లుమంది.

(నది, సెప్టెంబర్ 2009)